జూన్ 12 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. అదేనెల 20వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తామని వివరించారు. అదే నెల ఐదు నుంచి తొమ్మిదో తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూన్ 21న ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నైతికత, మానవ విలువలు పరీక్ష, 22న పర్యావరణ విద్య పరీక్షను నిర్వహిస్తామని తెలిపారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు గడువు ఈనెల 19 వరకున్న విషయం తెలిసిందే.

గుజరాత్ మోడల్ ఓ బోగస్..

- మోడీ దేశాన్ని మోసం చేసిండు...
- కులం, మతం మీద ఏ పార్టీ గెల్వదు
- బిఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో సిఎం కెసిఆర్
- పిల్లల కోడి లెక్కుండాలంటూ నేతలకు దిశా నిర్దేశం
- ఈ సారి 95 నుంచి 105 సీట్లు గెలుస్తామంటూ ధీమా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గుజరాత్ మోడల్ అనేది ఓ బోగస్ అని బిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కెసిఆర్ విమర్శించారు. ఈ క్రమంలో దేశానికి తెలంగాణ మోడల్ అనివార్యమని ఆయన తెలిపారు. ప్రధాని మోడీ దేశాన్ని మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కులం, మతం ప్రాతిపదికన ఏ పార్టీ గెలవబోదని స్పష్టం చేశారు. అందువల్ల ప్రజలతో అనున్యితం మమేకం కావాలని సూచించారు. 'పిల్లల కోడి లెక్కుండాలి.. తద్వారా అందర్నీ కాపాడుకోవాలి...' అని ప్రజా ప్రతినిధులకు దిశా నిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లో 95 నుంచి 105 సీట్లను గెలవబోతున్నామంటూ ఆయన ధీమా వ్యక్తం చేశారు. సర్వేలన్నీ బిఆర్ఎస్‌కె అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. తాను చెప్పినట్టు అందరూ కలిసికట్టుగా పనిచేస్తే ప్రతీ ఒక్కరికీ 50 వేలకన్నా ఎక్కువ మెజారిటీ వస్తుందని వివరించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కెసిఆర్ అధ్యక్షతన బిఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. మంత్రులు, బిఆర్ఎస్ ఎంపిలు, ఎమ్మెల్యేలు, జడ్‌పి చైర్మన్లతోపాటు అన్ని స్థాయిల్లోని ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, డిసిసిబి, డిసిఎంఎస్ చైర్మన్లు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కెసిఆర్ రానున్న ఎన్నికలు, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు, ఈ పదేండ్ల కాలంలో సాధించిన ప్రగతి తదితరాంశాలపై సుదీర్ఘంగా ప్రసంగించారు.

తెలంగాణ అనేది వజ్రపుతునక అని సిఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. స్వరాష్ట్రం సాధించుకుని అద్భుతంగా ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ (దశాబ్ది) ఉత్సవాలను జూన్ 2 నుంచి 21 వరకు ఘనంగా నిర్వహించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులందరూ ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని, విషయ ప్రాతిపదికన రాజకీయాలు చేయాలి తప్ప చిల్లర మల్లర అంశాలు, కుత్సిత మనసుతో పని చేయొద్దని, అత్యధికంగా సిట్టింగులకే ఈసారి సీట్లు కేటాయిస్తామని, ప్రతీ అంశాన్ని నేనే స్వయంగా పర్యవేక్షిస్తున్నా.. అందువల్ల ఏ ఒక్కరూ ఎలాంటి తప్పుకూ ఆస్కారమివ్వొద్దని, కల్తీ విత్తనాలపై సీరియస్‌గా ఉండాలని, వాటిని అమ్మే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని, రైతులను మోసం చేసే వారిని ప్రభుత్వం వదిలిపెట్టబోదనే సంకేతాలను ఇవ్వాలని, దశాబ్ది ఉత్సవాల్లో ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్ సేవలను విరివిగా వినియోగించుకోవాలని, కవి సమ్మేళనాలు నిర్వహించాలి. వీటికి ఎమ్మెల్యేలే నేతృత్వం వహించాలని కెసిఆర్ బిఆర్ఎస్ నేతలకు పలు సూచనలు చేశారు.

పాలిసెట్‌కు 92.94 శాతం హాజరు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్ రాతపరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణా మండలి (ఎస్‌బీటీఈటీ) కార్యదర్శి డాక్టర్ సి శ్రీనాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 296 పరీక్షా కేంద్రాల్లో పాలిసెట్ రాతపరీక్షను నిర్వహించామని తెలిపారు. 58,520 మంది అబ్బాయిలు దరఖాస్తు చేసుకుంటే 54,700 (93.47 శాతం) మంది హాజరయ్యారని పేర్కొన్నారు. 47,222 మంది అమ్మాయిలు దరఖాస్తు చేస్తే 43,573 (92.27 శాతం) మంది పరీక్ష రాశారని తెలిపారు. పాలిసెట్‌కు మొత్తం 1,05,656 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, వారిలో 98,273 (92.94 శాతం) మంది హాజరయ్యారని వివరించారు.

రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా రవీందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా పిట్టల రవీందర్ ను, వైస్ చైర్మన్‌గా దీటీ మల్లయ్యను సిఎం నియమించారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వారు ఆయా పదవుల్లో రెండు సంవత్సరాలు కొనసాగనున్నారు.

మీడియా, వినోద రంగాల్లో భారీ పెట్టుబడులు

- హైదరాబాద్‌లో వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సెంటర్
- 1200 మందికి ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మీడియా, వినోద రంగానికి చెందిన ప్రఖ్యాత సంస్థ వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ తెలంగాణలో పెట్టుబడి పెట్టబోతుంది. హెచ్‌బిఒ, మ్యాక్స్, సిఎన్ఎన్, టిఎల్‌సి, డిస్క వరీ, డిస్కవరీప్లస్, డబ్ల్యూబి, యూరోస్పోర్ట్, యానిమల్ ప్లానెట్, కార్టూన్ నెట్‌వర్క్, సినిమాక్స్, పోగో, టూన్‌కార్ట్, హెచ్‌జిటివితోపాటు క్వెస్ట్ వంటి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన టెలివిజన్, ఫిల్మ్, స్ట్రీమింగ్, కంటెంట్ బ్రాండ్‌లు, ఫ్రాంచైజీలు వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సంస్థకు చెందినవే. గేమింగ్, స్ట్రీమింగ్‌తో పాటు ఎంటర్ టైన్‌మెంట్ రంగంలో భారత మార్కెట్‌లో ఉన్న అపార అవకాశాలను అందిపుచ్చుకునే లక్ష్యంతో హైదరాబాద్‌లో డెవలప్‌మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ ముందుకొచ్చింది. అమెరికా పర్యటనలో ఉన్న ఐటీ మంత్రి కేటీఆర్‌తో వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఫైనాన్స్) అలెగ్జాండ్రా కార్టర్ సమావేశమయ్యారు. తమ విస్తరణ ప్రణాళికలపై చర్చించారు. ఇండియాలో తమ మార్కెట్‌ను సుస్థిరం చేసుకునే లక్ష్యంతో డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తామని అలెగ్జాండ్రా తెలిపారు. మొదటి సంవత్సరం 1200 మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. వ్యాపారం పెరిగేకొద్ది మరింత మందికి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ పెట్టుబడి ప్రకటనపై మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సంస్థకు ప్రభుత్వం తరుపున సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. అంతకుముందు న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్ కెనడీ అంతర్జాతీయ విమా నాశ్రయంలో మంత్రి కేటీఆర్‌కు ఎన్ఆర్ఐల బృందం ఘనంగా స్వాగతం పలికింది.

ధాన్యం కొనుగోలు పర్యవేక్షణకు

విజిలెన్స్ బృందాలు

- తరుగు తీస్తే క్రిమినల్ కేసులు
- పౌరసరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు వచ్చిన తర్వాత తాలు పేరుతో తరుగు తీయడం చట్ట విరుద్ధమని తేమ, తాలు, తరుగుతో రైతులను ఇబ్బందులు పెడితే ఉపేక్షించేది లేదని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ రైస్ మిల్లర్లను హెచ్చరించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసి తరుగు పేరుతో కోత విధించే మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. క్షేత్రస్థాయిలో కొంత మంది అధికారుల నిర్లక్ష్యం వల్ల తరుగు సమస్య వస్తుందన్న ఫిర్యాదులపై ఆయన ఇప్పటికే జిల్లాల వారీగా నివేదికలు తెప్పించుకున్నారు. దీనిపై మాట్లాడుతూ అధికారుల అలసత్వం వల్ల రైతులు ఇబ్బందులకు గురైతే కఠిన చర్యలు తీసుకోవడానికి ఏమాత్రం వెనకాడబోమని హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రొక్యూర్మెంట్, మార్కెటింగ్, ఫైనాన్స్ అధికారులతో బుధవారం సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పౌరసరఫరాల సంస్థ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి జిల్లాల్లో ఎంత ధాన్యం కొనుగోలు చేశారు? ఒపిఎంఎస్ ఎంత నమోదు చేశారు? రెండింటికీ మధ్య ఉన్న వ్యత్యాసాలు, ఒపిఎంఎస్ నమోదులో ఎదురవుతున్న సమస్యలు, ఆలస్యానికి గల కారణాలు, కొనుగోలు చేసిన ధాన్యంలో ఎంత ధాన్యం మిల్లులకు తరలించారు? ఏ ఏ మిల్లుల్లో మిల్లర్ అక్నాలెడ్జ్ సమస్య ఉంది?, సమస్య ఉన్న మిల్లులను విధిగా సందర్శించడం, చెల్లింపుల ఆలస్యానికి కారణాలపై విశ్లేషణ, చెల్లింపులను వేగవంతం చేయడానికి చేపడుతున్న చర్యలను ఈ బృందాలు ప్రధానంగా సమీక్షిస్తాయని తెలిపారు.

ధాన్యం కొనుగోలు వివరాలను మిల్లర్లు ట్రాక్ షీట్లో నమోదు చేయడంలో జాప్యం జరుగుతోందని రవీందర్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలనీ, అలాగే రైస్ మిల్లర్లూ ధాన్యాన్ని వెంటనే దించుకుని వివరాలను ట్రాక్ షీట్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎక్కడ జాప్యం జరిగినా దాని ప్రభావం మద్దతు ధర చెల్లింపులపై పడుతోందన్న విషయాన్ని గుర్తించి అధికారులు పని చేయలని కోరారు. దించుకున్న ధాన్యానికి మిల్లర్ అక్నాలెడ్జ్ ఇవ్వకుండా జాప్యం చేస్తే దీనికి జిల్లా మేనేజరే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం ప్రతి కొనుగోలు కేంద్రంలో రైసు మిల్లర్ ప్రతినిధి ఖచ్చితంగా ఉండాలని ఆదేశించారు. తక్షణం రైసు మిల్లర్ ప్రతినిధి ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

రెండు ప్రాణాలను బలిగొన్న సెల్ఫీ

- ఎస్సారెస్పీలో పడి ఇద్దరు మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎస్సారెస్పీ గేట్ల వద్ద సెల్ఫీ తీసుకునేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు గోదావరి నీటి గుంటలో ఒకరు మునిగిపోతుండగా.. రక్షించేందుకు వెళ్లి మరొకరు మృతిచెందిన ఘటన నిజామాబాద్ జిల్లా పోచంపాడ్‌లోని ఎస్సారెస్పీ వద్ద బుధవారం జరిగింది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని పూణేకు చెందిన అబ్దుల్ బార్, నిర్మల్ జిల్లా కురానాపేటలో ఉంటున్న తన పెద్దనాన్న అబ్దుల్ ఫయిమ్ ఇంటికి వచ్చాడు. కాగా, బుధవారం వారంతా కలిసి పోచంపాడ్ శ్రీరాంసాగర్ ప్రాజెక్టును చూడటానికి వచ్చారు. ప్రాజెక్టు దిగువన ఉన్న ఎస్కేప్ గేట్ల దగ్గర అబ్దుల్ బార్ (12) సెల్ఫీ ఫొటో దిగుతుండగా నీటి గుంటలో పడ్డాడు. మునిగిపోతున్న అతన్ని రక్షించడానికి అబ్దుల్ ఫయిమ్ (38) ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఇద్దరూ నీటి గుంటలో మునిగి మరణించారు. వారితో వచ్చిన ఫయీమ్ కుమారుడు స్థానికులకు చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ ఘటనా స్థలానికి చేరుకుని వారిని నీటినుంచి బయటకు తీయించి ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

నిరసన చేస్తున్న అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం నాయకులు

బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలి

అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం అధ్యక్షవర్గ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోని అగ్రశ్రేణి మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రీజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేసి, పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం అధ్యక్షవర్గ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ మౌనమే రేపిస్టులకు రక్షణ కల్పిస్తుందని, లైంగిక నేరస్థులకు ఆశ్రయం కల్పించి బిజెపి నీచమైన చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నెల రోజులుగా నిరసన తెలుపుతున్న రెజ్లర్లులకు సంఘీభావంగా బుధవారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై అంబేద్కర్ విగ్రహం వద్ద ఎఐపిఎస్ఒ హైదరాబాద్ జిల్లా సమితి నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. లైంగిక హింసకు వ్యతిరేకంగా రెజ్లర్లు చేస్తున్న ఆందోళనను కేంద్రంలోని కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. మహిళా రెజ్లర్ల కన్నీళ్లను దేశం చూస్తోందని, దేశ ప్రజలు బిజెపిని క్షమించరని చెప్పారు. శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, లేకుంటే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. సంఘం హైదరాబాద్ నగర కమిటీ ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ మాట్లాడుతూ.. మహిళా రెజ్లర్ల సమస్యలపై ప్రధాని మోడీ స్పందించకపోవడం దారుణమన్నారు. లైంగిక బాధితులకు న్యాయం చేయకుండా.. తమ పార్టీలో ఉన్న నేరస్తులను బిజెపి రక్షిస్తోందని విమర్శించారు. ప్రధాని మోడీ మౌనం వీడి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేసేందుకు ఢిల్లీ పోలీసులకు తక్షణమే ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం హైదరాబాద్ నగర కమిటీ అధ్యక్షులు గురుబచన్ సింగ్, మహమ్మద్ మాజీద్, రఘుపాల్, ఆఫీస్ బేరర్స్ సుధావన్, ప్రేమ్ పావని, మంజుశ్రీ, రాకేష్ సింగ్, రాములు యాదవ్, మాచుకూరి వేణు, గోవింద్, జావేద్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ పంచాయతీలను

తెలంగాణలో కలిపేందుకు కృషి

- ఆదివాసీల అభివృద్ధికి కలిసి పనిచేయాలి
- భద్రాద్రిలో గవర్నర్ తమిళి సై సౌందరరాజన్
- ఆదివాసీలతో ముఖాముఖి

భద్రాచలం ఆలయాన్ని సందర్శిస్తున్న గవర్నర్ తమిళి సై

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రాలో విలీనమయిన ఐదు గ్రామ పంచాయతీలు కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం, గుండాల, ఎటపాక గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆయా గ్రామాలను తెలంగాణలో కలిపేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ తెలిపారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో ఆదివాసీలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి గవర్నర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆంధ్రాలో కలిసిన ఐదు పంచాయతీ గ్రామాల ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదివాసీల అభివృద్ధికి తన వంతుగా బైక్ అంబులెన్సులు, విద్యుత్ ఆటోలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఆదివాసీల పిల్లల విద్యాభివృద్ధికి అదనపు తరగతి గదులు, అంగన్వాడీ కేంద్రాలు నిర్మించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆదివాసీల ఆర్థిక, ఆరోగ్య పరిరక్షణ చర్యల్లో భాగంగా గిరిరాజా కోళ్లు, చిరుధాన్యాలతో కూడిన ఆహారం అందించడంలో పాలు పంచుకోవడం చాలా సంతోషమని చెప్పారు. ఆర్థిక అభివృద్ధికి స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలు, మహిళా సాధికారత కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య పరిరక్షణా చర్యలో భాగంగా.. అనీమియా, మలేరియా, మాల్ న్యూట్రిషన్ల బారి నుంచి ప్రజలను కాపాడేందుకు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, రెడ్ క్రాస్ ద్వారా సేవలు అందిస్తామని తెలిపారు. తెలంగాణకు సరిహద్దునున్న రాష్ట్ర ప్రజలకు వైద్య సేవలు అందించుటలో భద్రాచలం ఏరియాస్పత్రి ప్రధానమైనదని, దాంట్లో డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది. ఖాళీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, భద్రాచలం శాసనసభ్యులు భర్తీకి చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యేను కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల అభివృద్ధికి ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, అయినప్పటికీ వారి జీవితాల్లో ఆశించిన స్థాయిలో మార్పులు రాకపోవడానికి గల కారణాలపై అన్వేషణ చేస్తామన్నారు. కాగా, తెలుగులో ప్రసంగం ప్రారంభించిన గవర్నర్ తాను తమిళనాడు ఆడబిడ్డనని, తెలం గాణకు అక్కనని చెప్పారు. కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు పోదెం వీరయ్య, గవర్నర్ ప్రయివేటు కార్యదర్శి భవాని శంకర్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఒ మధుసూదన్, ఉద్యాన అధికారి జినుగు మరియన్న, సహకార అధికారి వెంకటేశ్వర్లు, ఇంటర్మీడియట్ అధికారి సులోచనారాణి, గిరిజన సంక్షేమ శాఖ డిడి రమాదేవి, మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు, ఎపిఒ జనరల్ డేవిడ్ రాజు, ఆర్‌డిఒ రత్నకల్యాణి పాల్గొన్నారు.

భద్రాద్రి రామున్ని దర్శించుకున్న గవర్నర్

శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ దర్శించుకున్నారు. గవర్నర్‌కు పూర్ణ కుంభంతో ఆలయ అర్చకులు, ఆధికారులు స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రత్యేక పూజలు అనంతరం శ్రీ లక్ష్మి తాయారు అమ్మవారి ఆలయంలో వేద పండితుల ఆశీర్వాదం అందుకున్నారు. అనంతరం దర్శనానికి విచ్చేసిన క్యూ లైన్‌లో ఉన్న భక్తులను గవర్నర్ పలకరించారు. ఇదిలా ఉండగా జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ అనుదీప్, ఎస్పీ డాక్టర్ వినీత్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ గౌతమ్ పోట్రూ, భద్రాచలం ఆర్డీవో రమాదేవి, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ తదితరులు పుష్పగుచ్చం అందించి స్వాగతించారు.

కంటోన్మెంట్, కేంద్ర సంస్థల భూముల్లోని

పేదల నివాసాలను క్రమబద్ధీకరించాలి

- కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డికి సిపిఎం బహిరంగ లేఖ

ఎం శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూముల్లోని పేదల ఇళ్లను జిఒ 58 ప్రకారం రెగ్యులరైజేషన్ చేస్తున్న మాదిరిగానే కంటోన్మెంట్, కేంద్ర ప్రభుత్వ సంస్థల భూముల్లోని బస్తీలు, కాలనీల నివాసలను సైతం క్రమబద్ధీకరించాలని సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ భూముల్లో ఉన్న పేదల ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిఒ 58 అమలు చేస్తోందన్నారు. కొందరు మురికివాడల ప్రజలు 2015లో ఈ క్రమబద్ధీకరణతో ఇళ్ల పట్టాలు పొందారని గుర్తుచేశారు. ప్రస్తుతం అనేక మంది క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. అయితే, నగరంలోని కొన్ని మురికివాడలు కంటోన్మెంట్, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన స్థలాల్లో ఏర్పడగా.. వేలాది పేద కుటుంబాలు ఈ బస్తీల్లో నివాసముంటున్నాయని పేర్కొన్నారు. దశాబ్దాలుగా నివసిస్తున్నప్పటికీ వీరికి ఇంటి స్థలం మీద ఎలాంటి హక్కులూ కల్పించడం లేదన్నారు. అనేక మురికివాడలు కంటోన్మెంట్, రైల్వే, రక్షణ, ఎయిర్‌పోర్ట్ ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల భూముల్లో ఉన్నాయన్నారు. ఈ బస్తీల్లోని పేదల ఇండ్లను సైతం జిఒ 58 మాదిరిగా క్రమ బద్ధీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. రైల్వే శాఖకు చెందిన వందల ఎకరాల భూములను దీర్ఘకాలిక లీజ్ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం చౌకగా కట్టబెడుతోందన్నారు.

మూసీ కాలువ వద్ద మహిళ తల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మలక్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధిలో తీగలగూడలోని మూసీ కాలువ వద్ద మొండెం లేని మహిళ తల లభ్యమైంది. స్థానికంగా ఈవార్త కలకలం సృష్టించింది. బుధవారం ఉదయం 7.30గంటలకు పారిశుద్ధ్య కార్మికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సౌత్ జోన్ అడిషనల్ డిసిపి ఆనంద్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. మృతిచెందిన మహిళ వయసు 30-45 ఏళ్ల మధ్య ఉంటుందని గుర్తించారు. పరిసర ప్రాంతాల్లో హత్య చేసి తీసుకువచ్చారా? వేరే ప్రాంతం నుంచి తీసుకువచ్చి పడేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మహిళ మొండెం ఆచూకీ కోసం గాలిస్తున్నారు. సమీపంలోని సిసి ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఎండ తీవ్రతకి నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

ఎండకు సలసల

- రాష్ట్ర వ్యాప్తంగా హడలెత్తిస్తున్న ఎండలు
- 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- మొండికేస్తున్న ఎసి, కూలర్లు
- నిర్మానుషంగా రోడ్లు.. జంకుతున్న జనం..!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోజురోజుకూ వేసవి భానుడి ప్రతాపం తీవ్ర స్థాయికి చేరింది. ప్రతి సంవత్సరం లాగానే వేసవి కాలం ఎండలు భగభగలాడుతుంటాయి. ఈ ఏడాది మాత్రం కాస్త ముదిరి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వేసవి కాలం ప్రారంభం నుండి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదు అవుతున్నాయి. మూడు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు.. ఇతర ప్రాంతాల నుంచి వీస్తున్న వేడి గాలుల వల్ల కొత్తగూడెం పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరాయి. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి ఉంది. 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత్తలకు పైగా నమోదవుతున్నాయి. వడదెబ్బకు పలువురు మృతి చెందుతున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే సూర్యతాపం చూపిస్తోంది. సాయంత్రం ఆరు గంటల వరకు వేడి వాతావరణం ఏమాత్రం తగ్గడంలేదు.

46.4 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

వేసవి కాలం వచ్చిందంటే కొత్తగూడెం పట్టణంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. సింగరేణి కోల్ మైనింగ్ ప్రాంతం కావడంతో మూడు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో వేసవి వాతావరణంలో పెద్ద ఎత్తున మార్పులు చోటు చేసుకున్నాయి. సింగరేణి ఓపెన్ కాస్ట్ మైనింగ్ కారణంగా అడవులు నరికి వేయడం వల్ల, ఉపరితలం నుంచి బొగ్గు నిక్షేపాలు వెలికి తీసే ప్రక్రియ మొదలు కావడంతో వేడి వాతావరణం రికార్డు నమోదు అవుతుంది. ఈ ఏడాదిలో ఇప్పటికే 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కోల్ మైనింగ్ కారణంగా అడవులు నరికివేశారు. అదే స్థాయిలో స్థానికంగా మొక్కల పెంపకం జరగని కారణంగా ఓపెన్ కాస్ట్ నుంచి వేడిగాలులు నేరుగా వీస్తున్న క్రమంలో ఈ ప్రాంత ప్రజలకు వేసవి కాలం తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. ఇదిలా ఉండగా.. ఈ తరుణంలో కొత్తగూడెంలో 48 డిగ్రీల స్థాయికి వేడి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయింది. కొత్తగూడెం పట్టణంలో 45.4, పాల్వంచలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మొండికేస్తున్న ఎసిలు, కూలర్లు

ఎండ తీవ్రతను తట్టుకోలేక, బయటకు రాలేక ఇళ్లకే పరిమితమవుతున్న ప్రజలకు అత్యధిక ఉష్ణోగ్రతలు వెంటాడుతున్నాయి. ఇళ్లల్లో ఫ్యాన్లు, కూలర్లు, ఎసిలు మొండికేస్తున్నాయి. తక్కువ స్పీడ్‌లోనే చల్లని గాలులు వీచే బ్రాండెడ్ కంపెనీ విద్యుత్ పరికరాలూ ఎండ తీవ్రతకు మూలుగుతున్నాయి. దాంతో ఇంట్లో ఉన్న వారికీ వేసవి భానుడి తాపానికి గురికాక తప్పడం లేదు. చంటి బిడ్డలు, వయో వృద్ధులు ఎండ వేడికి తట్టుకోలేక పోతున్నారు. కొన్ని పట్టణాల్లో సెల్ టవర్స్‌లో మంటలు చెలరేగుతున్నాయి.

నిర్మానుషంగా రోడ్లు.. జంకుతున్న జనం..!

ఎండ భయంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దినసరి కార్యక్రమాలు చేసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు బయట పనులు ముగించుకొని ఇళ్లకే పరిమితమవుతున్నారు. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుషంగా కనిపిస్తున్నాయి. చిరు వ్యాపారులు, మధ్యతరగతి వ్యాపార సముదాయాల షాపులు మూసివేసి సాయంత్రం తిరిగి ప్రారంభిస్తున్న తీరు కనిపిస్తుంది. కొబ్బరి బొండాలు, తాటి ముంజలు, జ్యూస్, ఇతర శీతలపానీయాల జోరు తీవ్రంగా ఉంది. రాత్రి వేళల్లో మాత్రమే షాపింగ్ చేయడానికి సిద్ధమవుతున్నారు.

రైతు చైతన్య యాత్రల జాడేది

- ఉత్సవ విగ్రహాల్లా రైతు వేదికలు
- ముంచుకొస్తున్న ఖరీఫ్ సీజన్
- సాగు ప్రణాళికలు, విత్తనాలు, ఎరువులు..
- పంట రుణాలన్నీ పై ఆదేశాల మేరకే అమలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మారుతున్న వాతావరణ పరిస్థితులను బట్టి సాగు విధానంలోనూ పంటల మార్పు అనివార్యం. నూతన వంగడాలు, సాంకేతికత, పంటల సాగుకు ప్రభుత్వాల ప్రోత్సహకాలతో పాటు అనుకూల వాతావరణం ఉంటేనే వ్యవసాయం గిట్టుబాటు అయ్యేది కష్టం. ఎండా కాలంలో వానలు పడడం, వానాకాలంలో ఎండలు కాయడం వంటి అసమతుల్య వాతావరణ పరిస్థితుల్లో రైతులకు వివిధ అంశాల పట్ల అవగాహన కల్పించి, శిక్షణ ఇవ్వాలి. అందుకే వారి వద్దకెళ్లి పలు సూచనలు, సలహాలిచ్చేందుకు రైతు చైతన్య యాత్రల ద్వారా అధికారులందరూ గ్రామాలకెళ్లేది. ఆ యాత్రలను ఆపేసి ప్రత్యామ్నాయంగా నిర్మించిన రైతు వేదికలు ఉత్సవ విగ్రహాలయ్యాయి. అధికారులెవ్వరూ ఆ భవనాలకు వెళ్లడం లేదు. విపత్కర పరిస్థితుల్లోనూ అధికారులు రైతులకు రైతు వేదికల్లో అందుబాటులో ఉండటం లేదు.

రైతు చైతన్య యాత్రల వల్ల మేలు

రైతు చైతన్య యాత్రల వల్ల రైతులకు ఎన్నో ఉపయోగాలున్నాయి. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, పశుసంవర్ధక, విద్యుత్, ఇరిగేషన్ శాఖ లీడ్, డీసీసీబీ, ఇతర బ్యాంకు అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతు చైతన్య యాత్రల్లో పాల్గొనేవారు. రాష్ట్రంలోని ప్రతి మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించేలా 15 రోజుల పాటు షెడ్యూల్ ఖరారు చేసి అధికారుల బృందాలు పర్యటించేవి. 12,500 గ్రామాల్లో యాత్రలు జరిపితే సుమారు 13 లక్షల మంది రైతులు హాజరయ్యేవారు. ఊర్లల్లో రైతులతో సమావేశం జరిపి వ్యవసాయ సీజన్ సన్నద్ధతపై ఖరీఫ్ ప్రణాళికలను వివరించేవారు. మార్కెట్‌లోకి వచ్చిన కొత్త వంగడాలు, విత్తనాలు ఎప్పుడు వేసుకోవాలి, ఏ ఏ పంటకు ఎంత మద్దతు ధర, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలేవనే విషయాలు వివరించేవారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రతలు, సస్యరక్షణ, వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, సాగునీటి వనరులు, విద్యుత్ సరఫరా, ఎరువులు, విత్తనాల స్టాక్, ధరల పట్టిక వంటి విషయాలు చెప్పేవారు. ఏ పంటకు ఎంత రుణమిస్తారనేది బ్యాంకర్లు వివరించేవారు.. చెరువులు, ప్రాజెక్టుల కింద నీటి విడుదల, వ్యవసాయానికి 24 గంటల కరెంట్ సరఫరా, విద్యుత్ కనెక్షన్ల మంజూరీ, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలకు పరిష్కారం చూపేవారు.. రైతు బంధు, రైతు బీమా, పంట నష్టం, బీమా పథకాలపై అవగాహన కల్పింవారు.. భూ సమస్యలకూ పరిష్కారం చూపేవాళ్లు. పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం చేపడుతున్న పథకాల్ని వివరించేవారు.. వివిధ శాఖల అధికారులు మాట్లాడి అవగాహన కల్పించడం, పలు సూచనలు, సలహాలు ఇవ్వడం వల్ల రైతులకు ఎంతో మేలు జరిగేది. ప్రభుత్వం చైతన్య యాత్రలను జరపాలని రైతులు కోరుతున్నారు.

ముంచుకొస్తున్న ఖరీఫ్ సీజన్

ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తుంది. ఖరీఫ్ పంటల సాగు కోసం రైతులు మే నెలలో వేసవి దుక్కులు దున్నుకుంటున్నారు. ఇటీవల వర్షాలు కురిశాయి. ఖరీఫ్‌లో అధికంగా పంటలు సాగవుతాయి. వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న, శనగ, చెరకు, కూరగాయల సాగు కోసం విత్తనాలు సమకూర్చుకుంటున్నారు. జూన్ నుంచే వివిధ పంటల విత్తనాలు వేస్తారు. నైరుతీ రుతుపవనాల ప్రభావం ఎలా ఉన్నా సన్నద్ధమయ్యేందుకు రైతులు సిద్దమవుతున్నారు. కాగా, గతేడాది సాగు విస్తీర్ణంకు అటు ఇటుగా అంకెలను మార్చడం తప్ప క్షేత్ర స్థాయిలో రైతులతో మాట్లాడి వారి ప్రాంతాల్లో ఏ ఏ పంటలు వేస్తే లాభం, వారికి కావాల్సిన అవసరాలేమిటీ.. అనేది చర్చించడం లేదు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో మెదక్ జిల్లాలో 3,42,838 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో వరి 2,83,590 ఎకరాలు, పత్తి 48,000 ఎకరాల్లో సాగైంది. ఇతర పంటలు కలిపి 11,248 ఎకరాల్లో వేశారు. సిద్దిపేట జిల్లాలో 3,61,000 ఎకరాల్లో వరి, 2.10 లక్షల ఎకరాల్లో పత్తి, ఇతర పంటలు మరో లక్ష ఎకరాల్లో సాగైంది. సంగారెడ్డి జిల్లాలో వివిధ పంటలు కలిపి 7,02,789 ఎకరాల్లో సాగయ్యాయి. వీటిల్లో వరి 1,38,349 ఎకరాలు, పత్తి 3,44,570 ఎకరాలు, కంది 78,157, సోయా చిక్కుడు 79,361, ఇతర పంటలు 62,352 ఎకరాల్లో సాగయ్యాయి. ఈ ఏడాది ఖరీఫ్‌కు కూడా అవే లెక్కల్ని ఖరీఫ్ ప్రణాళికలుగా అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో రైతులను కలిసి గతేడాది సాగు అనుభవాలు, నష్టాలు, లాభాల గురించి చర్చించి పంట సాగు విస్తీర్ణాన్ని అంచనా వేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉత్సవ విగ్రహాల్లా రైతు వేదికలు

రైతులందరికీ ఉపయోగపడేలా రాష్ట్రవ్యాప్తంగా 2500 రైతు వేదికలను రాష్ట్రప్రభుత్వం నిర్మించింది. వీటిల్లో రైతులు సమావేశాలు జరుపుకోవడం, వ్యవసాయ అధికారులు వర్క్‌షాప్‌లు పెట్టి వివిధ అంశాలపై రైతులకు శిక్షణ, అవగాహనా కల్పించడం కోసం వీటిని నిర్మించారు. రైతు చైతన్య యాత్రలకు ప్రత్యామ్నాయంగా రైతు వేదికలు కట్టామని ప్రభుత్వం చెబుతోంది. వాస్తవంగా రైతు వేదికలు ప్రత్యామ్నాయం కాకుండా ఉత్సవ విగ్రహాల్లా నిరుపయోగంగా మారాయి. క్షేత్రస్థాయికి వెళ్లి వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఏఈఓలు రైతులను కలవడంలేదు. వ్యవసాయ, మత్స్య, ఉద్యాన, విద్యుత్, ఇరిగేషన్, పశుసంవర్ధక, మార్కెటింగ్, మదర్ డైయిరీ, లీడ్, డీసీసీబీ, ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంకు అధికారులెవ్వరూ రైతు వేదికలకు రావడంలేదు. వచ్చినా అలా వచ్చి ఇలా వెళ్తున్నారు. తాళాలు వేసి ఉంటున్నాయి. ఇటీవల రాష్ట్రంలో అకాల వడగండ్ల వానలొచ్చి అపారమైన పంట నష్టమేర్పడింది. ధాన్యం రాలిపోయింది. కల్లాల్లో తడిసింది. లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగితే ఏ అధికారులు వెళ్లలేదు. సిఎం కెసిఆర్ నష్టపరిహారం ప్రకటించి నివేదికలు కోరినా క్షేత్రస్థాయికి అధికార యంత్రాంగం వెళ్లలేదు.

చైతన్య యాత్రల వల్లనే రైతుకు లాభం: రాజయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

రైతు చైతన్య యాత్రలు నిర్వహించాలి. గతంలో వీటి వల్ల రైతులకు అనేక విషయాల్లో అవగాహన కలిగేది. అధికారులు ఊర్లకొచ్చి రైతుల సమస్యలు విని పరిష్కరించేవారు. వాటిని జరపకుండా రైతు వేదికలే ప్రత్యామ్నాయం అంటే లాభంలేదు. వాటిని చూసుకుని మురియడం తప్ప అక్కడికి అధికారులు రావట్లేదు. రైతులకు శిక్షణ, అవగాహన సమావేశాలు జరగట్లేదు. ఏఈఓలు వచ్చినప్పుడు రైతులు వెళ్లి కలిసే పరిస్థితిలేదు. రైతు వేదికల్లో గ్రీవెన్స్ డే నిర్వహించాలి.

ధర్నా చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐకెపి సెంటర్‌లోని ధాన్యంను వెంటనే కొనుగోలు చేయాలని, గన్నీ సంచుల కోసం పడిగాపులు కాస్తున్న అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పట్టించుకోవడం లేదని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం, హన్మకొండ జిల్లాల్లో రైతులు ధర్నా నిర్వహించారు. హన్మకొండ జిల్లా శాయంపేట మండలం మైలారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభమయినప్పటికీ రైతులకు గన్నీ సంచులు ఇవ్వడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రం వద్దకు లారీల్లో గన్నీ సంచులు వచ్చాయని, గోదాముల్లో సంచులు నిల్వ చేస్తున్నారని తెలిపారు. పెద్దకోడపాక క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి శివకుమార్, మండల వ్యవసాయ అధికారి గంగా జమున సెలవుల్లో ఉండటంతో రైతులకు టోకెన్లు ఇచ్చేవారు లేక పిఎసిఎస్ సిబ్బంది గన్నీ సంచులు ఇవ్వటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ ఉన్నతాధికారులు సెలవులపై వెళ్తూ ఇన్‌చార్జి ఎఇఒలను నియమించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. గతంలోనూ గన్నీ సంచులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడ్డామని, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జిల్లా జెడ్‌పి చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, పిఎసిఎస్ చైర్మన్ శరత్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిపారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామం సమీపంలోని ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై బుధవారం రైతులు ధర్నా నిర్వహించారు. ధర్నాకు పలు పార్టీలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ.. ఐకెపి సెంటర్‌లో నెల రోజులుగా ధాన్యం పోసి ఉంచినా ఇంకా కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. ధర్నా వద్దకు మండల వ్యవసాయాధికారి సీతారాంరెడ్డి, ఎంపిడిఒ జయరాం నాయక్‌లు వచ్చి రైతులుతో మాట్లాడారు. రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెల్లం శ్రీనివాస్, ఎంపిపి బోడ మంగీలాల్‌నాయక్, సిపిఎం నాయకులు పప్పుల ఉపేందర్, పిట్టల పాపారావు, బోడ పట్ల సతీష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు నలుగురు మృతి

- మృతుల్లో ముగ్గురు కూలీలు, ఒక మత్స్యకారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెరుగుతున్న ఎండలకు తట్టుకోలేక ఇద్దరు రైతు కూలీలు, మత్స్యకారుడు మృతి చెందిన ఘటనలు మహబూబాబాద్ జిల్లా, మెదక్ జిల్లాల్లో బుధవారం జరిగాయి. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోడిపుంజుల తండాకు చెందిన ఇస్లావత్ సీతారాం (55) మామిడి తోటలో కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఎండల తీవ్రత, వడగాలులకు తట్టుకోలేక వడదెబ్బకు గురై మృతిచెందారు. బయ్యారం మండలం రామచంద్రపురం గ్రామ పంచాయతీ చింతోని గుంపు గ్రామానికి చెందిన జోగా ఉపేంద్ర (38) వారం రోజులుగా తునికాకు సేకరణకు వెళ్లిన క్రమంలో ఎండ దెబ్బకు గురయ్యారు. దాంతో మహబూబాబాద్‌లోని ప్రయివేటు హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా.. వరంగల్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతిచెందారు. తొర్రూర్ మండలం గుర్తూరు గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తుడు పెసర రాజు (30) గ్రామంలోని పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లిన క్రమంలో వడదెబ్బ తగలడంతో సొమ్మసిల్లి కింద పడిపోయారు. స్థానికులు హుటాహుటిన తొర్రూరులోని ప్రయివేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. రాజుకు భార్య శిరీష, ఇద్దరు కుమారులు, తల్లి యాకమ్మ ఉన్నారు. మెదక్ జిల్లా నార్సింగి మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన మ్యాదరి బాలమణి (46) ఉపాధి హామీ పనులకు వెళ్లారు. పని చేస్తూనే నీరసంగా అనిపించింది.. ఇంటికి తిరిగి వచ్చాక తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు.. బాలమణిని చికిత్స కోసం నార్సింగి పట్టణ కేంద్రంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందారు.

ఇళ్ల స్థలాల కోసం నేడే మహాధర్నా

- మంత్రివర్గంలో నిర్ణయం తీసుకోవాలి
- టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యంలో గురువారం మహాధర్నా జరగనుంది. హైదరాబాద్‌లో ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జర్నలిస్టులు హాజరవుతున్నారు. ఇందిరాపార్క్ దగ్గర ఉదయం పది గంటలకు ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలవరకు ధర్నా నిర్వహించనున్నారు. దాదాపు 35 ఏళ్లుగా ఈ సమస్య పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జర్నలిస్టులు భారీ సంఖ్యలో మహాధర్నాలో పాల్గొనాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి బవవపున్నయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. గురువారం నిర్వహించే రాష్ట్రమంత్రివర్గ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. హైదరాబాద్‌తోపాటు జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేసే జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు కేటాయించాలని సూచించారు. తెలంగాణ వచ్చిన తర్వాత జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలుకావడం లేదని వివరించారు. ఇంళ్లస్థలం జర్నలిస్టుల తీరని కోరిక కాకూడదని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంళ్లస్థలాల సమస్యను పరిష్కరించాని విజ్ఞప్తి చేశారు.

మొగిలయ్య, కొమురమ్మకు దళిత బంధు

- కారు పంపిణీ చేసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దళితులకు అండగా కెసిఆర్ ప్రభుత్వం ఎల్లవేళలా ఉంటుందనీ, ఇందుకు నిదర్శనమే బలగం సినిమాలో పాటలు పాడిన పస్తం మొగిలయ్య, కొమురమ్మ దంపతులకు దళిత బంధు పథకం కింద కారు పంపిణీ చేయడమేనని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో కారును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. మూడేండ్లలో దళితులందరికి దళిత బంధు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. మొగిలయ్య, కొమురమ్మ దంపతులు సిఎం కెసిఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమకు అన్ని విధాలుగా అండగా నిలిచిన మంత్రులు హరీశ్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, పెద్ది సుదర్శన్ రెడ్డి, బేడ బుడగ జంగాల జెఎసి చైర్మన్ టి.జగదీశ్వర్, వైస్ చైర్మన్ చింతల యాదగిరిలకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే బేడ, బుడగ, జంగాల ప్రతినిధిగా చింతల యాదగిరికి తగిన పదవి ఇచ్చి, గౌరవించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల పదిన వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ కాగా బాగా చదివి సప్లమెంటరీ పరీక్షల్లోనైనా పాస్ అవ్వాలని తల్లిదండ్రులు మందలించడంతో.. విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలం వీరాపూర్‌లో బుధవారం జరిగింది. తాడ్వాయి ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. రంగాపూర్ గ్రామపంచాయతీ పరిధి వీరాపూర్ గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు పెనక విశ్వనాథంకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పెనక వివేక్(17) హనుమకొండలోని జ్యోతిరావు పూలే ఆశ్రమ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. కాగా ప్రథమ సంవత్సరం ఫెయిల్ అయ్యాడు. దీంతో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల్లో బాగా కష్టపడి చదివి పాస్ కావాలని మందలించారు. దాంతో మనస్తాపానికి గురైన వివేక్ ఈ నెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బీరెల్లి సర్పంచ్ జాజ చంద్రం హుటాహుటిన ములుగు ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజిఎంకు తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పేదలకు విద్యను దూరం చేసే కుట్రలో బిఆర్‌ఎస్

- ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలకు విద్యను దూరం చేసే కుట్రలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందని బహుజన సమాజ్‌పార్టీ అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని విమర్శించారు. తమ రాజకీయ ఎదుగుదల కోసం కెసిఆర్ నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రాకు చెందిన బిఆర్‌ఎస్ నేతకు మియాపూర్ ప్రభుత్వ భూములను అమ్ముకున్నారని పేర్కొన్నారు. 111 జిఒను ఎత్తేసి హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న వేల ఎకరాల భూములను బినామీ కంపెనీలకు అప్పజెప్పారని తెలిపారు. ఉచిత విద్యనందిస్తామంటూ గద్దెనెక్కిన కెసిఆర్ పేదలను విద్యకు దూరం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్న సచివాలయాన్ని కూల్చి రూ. 1400 కోట్లు ఖర్చుచేసి కొత్త సచివాలయాన్ని నిర్మించడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. గురుకుల జెఎల్ ఉద్యోగ నియామకాల కోసం దరఖాస్తు చేసుకోడానికి ఈ రోజు చివరి తేదీ అనీ, అభ్యర్థులు అప్లికేషన్ ఫీజు చెల్లించినా, సాంకేతిక కారణాల వల్ల సైట్ ఓపెన్ కాకపోవటంతో అభ్యర్థులు ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. గురుకుల జెఎల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునే గడువు పెంచాలని డిమాండ్ చేశారు.

డిఫెన్స్ ఉద్యోగుల సంఘం నేత గోపాల్‌రావుకు డిజి పరామర్శ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

డిఫెన్స్ ఉద్యోగుల సంఘం ఆలిండియా నాయకులు జీటీ గోపాల్‌రావు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. నాలికకు శస్త్ర చికిత్స చేసి 40శాతం తొలగించారు. ఆస్పత్రి నుంచి ఆయన డిశ్చార్జ్ అయి బడంగ్‌పేటలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. బుధవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నరసింహారావు, పట్నం రాష్ట్ర నాయకులు ప్రసాద్, నాయకులు కిషోర్ ఆయన్ను పరామర్శించారు. డిఫెన్స్ ఉద్యోగిగా నాయకుడిగా ఉద్యోగుల సమస్యల కోసం నిరంతరం పోరాడారు. ఆయన తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

పేదల ఇళ్ల కూల్చివేత అన్యాయం

- అర్హులైన వాళ్లకు రెగ్యులరైజ్ చేయాలి
- ఐలాపురం భూముల వివాదంపై సమగ్ర విచారణ జరపాలి
- కూల్చిన ఇళ్లను పరిశీలించిన సిపిఎం బృందం
- బాధితులకు అండగా ఉంటామని భరోసా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని ఐలాపురం, ఐలాపురం తండా గ్రామాల పరిధిలో పేదలు కట్టుకున్న ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని సిపిఎం నేతలు అన్నారు. బుధవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్, నాయిని నర్సింహరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరావు ప్రతినిధి బృందం కూల్చిన ఇళ్లను పరిశీలించి, నష్టపోయిన బాధితులతో మాట్లాడారు. 119 సర్వేనెంబర్‌లో ఉన్న భూముల పూర్వాపరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం వలస వచ్చిన పేదలు తక్కువ ధరకు లభిస్తుందని ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్నారని తెలిపారు. ప్రభుత్వపరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్థానిక నాయకులు చెప్పడంతో పేదలు ఇళ్లు కట్టుకొని ఉంటున్న సమయంలో అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి ఇళ్లను కూల్చివేయడం అన్యాయమన్నారు. ఇంట్లో ఉంటున్న వాళ్లను బయటికి ఈడ్చుకొచ్చి పడేసి జెసిబి, ఇటాచీలతో ఇళ్లను పూర్తిగా ధ్వంసం చేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐలాపుం, ఐలాపురం తండాలో ఎన్నో ఏళ్లుగా ప్లాట్ల విక్రయాలు జరుగుతున్నాయని, కాయకష్టం చేసి పోగేసుకున్న సొమ్ముతో ప్లాట్లు కొనుకున్న పేదలు ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. ప్లాట్ల కొనుగోళ్లు, ఇళ్ల నిర్మాణాలు జరుగుతుంటే ప్రభుత్వం గానీ ప్రభుత్వ అధికారులు కానీ ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. ఇళ్లు కట్టుకున్న ప్రాంతంలో రోడ్లు వేసి, ఇళ్లకు ఇంటి నెంబర్లు ఇచ్చి పన్నులు వసూలు చేశారని తెలిపారు. విద్యుత్ శాఖ నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంబాలేసి కరెంట్ మీటర్లు పెట్టింది అధికారులు కాదా అని ప్రశ్నించారు. ఐలాపురం భూముల క్రయవిక్రయాల్లో వేల కోట్ల కుంభకోణం దాగి ఉందని,. ఇట్టి భూముల వివాదంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకున్న వాళ్లకు రెగ్యులరైజ్ చేస్తున్న ప్రభుత్వం.. ఐలాపురం పేదలకూ వాళు కొనుగోలు చేసిన ప్లాట్లను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఇళ్లు కూల్చినందుకు నష్టపోయిన బాధితులకు ప్రభుత్వమే తిరిగి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మధ్యవర్తుల మోసపు మాటలు నమ్మి ప్లాట్లు కొనుగోలు చేసి ఇండ్లు కట్టుకున్న పేదలకు ప్రభుత్వం న్యాయం చేయాలని, మోసం చేసిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పేదలను సమీకరించి సిపిఎం పోరాడుతోందని స్పష్టంచేశారు.

బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం బృందం

జూన్ 8, 9,10 తేదీల్లో ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్

- మంత్రి తలసాని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు జూన్ 8,9,10 తేదీల్లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్టు రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. బుధవారం బీఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మృగశిర కార్తెను పురస్కరించుకుని 'ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్' నిర్వహణ, ఏర్పాట్లపై మంత్రి సమీక్షించారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అధర్ సిన్హా, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా ఉన్నారు. ఈ సందర్భంగా మత్స్య సహకార సంఘాల సొసైటీ చైర్మన్‌గా నియమితులైన పిట్టల రవీందర్ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం 10వ వసంతంలోకి అడుగుపెడుతున్న నేపద్యంలో జూన్ 2 వ తేదీ నుంచి 21 రోజులపాటు రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని ఆదేశించారని వివరించారు. చేపలతో తయారు చేసిన ఫిష్ ఫ్రై, కర్రీ, బిర్యానీ వంటి అన్ని రకాల వంటకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్వయం ఉపాధి పొందేలా అన్ని జిల్లాలకు చెందిన మహిళా మత్స్యకారులకు చేపలతో వివిధ రకాల వంటకాల తయారీపై ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర పండుగను తలపించే విధంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకోసం పశు సంవర్ధక, మత్స్య, డెయిరీ అధికారులతోపాటు గోపాలమిత్రలకు కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. నూతనంగా లక్ష మందికి మత్స్య సొసైటీలలో సభ్యత్వాలు కల్పించే విధంగా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్న విషయాన్ని కూడా మంత్రి గుర్తుచేశారు. రాష్ట్రంలోని మత్స్యకారులు ఎంతో సంతోషంగా ఉన్నారని వివరించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు

- ఎస్‌పి కోటిరెడ్డి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఎస్‌పి కోటిరెడ్డి హెచ్చరించారు. బుధవారం వికారాబాద్‌లోని ఎస్‌పి కార్యాలయంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ... నకిలీ విత్తనాల బారి నుంచి రైతులను కాపాడుకునే బాధ్యత మనందరిపైన ఉందన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ టీమ్, పరిగి, తాండూరు, వికారాబాద్ సబ్ డివిజన్ల వారీగా సబ్ డివిజన్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, వికారాబాద్ డీఎస్పీ సత్యనారాయణ, పరిగి డీఎసపీ కరుణాసాగర్‌రెడ్డి, తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు. అంతేకాకుండా రాత్రి సమయంలో విధుల్లో ఉన్న పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్‌పి కార్యాలయంలో పోలీస్ అధికారులతో క్రైమ్ రివ్యూ, కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్, ఫంక్షనల్ వర్టికల్, సీడీ పైల్స్, రోడ్డు ప్రమాదాలపై సమీక్ష నిర్వహించారు.

యువతకు టెలికమ్యూనికేషన్స్‌పై అవగాహన అవసరం

- కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్స్ రాకేష్ కుమార్ సింగ్

ప్రజాశక్తి-కల్చరల్

నేడు టెలి కమ్యూనికేషన్స్ రంగం విస్తృతంగా పెరిగిందని, సెల్‌ఫోన్ వినియోగదారుల సంఖ్య దేశంలో అధికంగా పెరిగిందని, ఇలాంటి పరిస్థితుల్లో యువత ఈ రంగంపై అవగాహన పెంచుకోవాలని కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ (గణాంక శాఖ) రాకేష్ కుమార్ సింగ్ సూచించారు. నగర కేంద్ర గ్రంథాలయంలోని సమావేశ మందిరంలో ప్రపంచ టెలి కమ్యూనికేషన్స్ దినోత్సవం సందర్భంగా మహిళలు, గిరిజన గ్రామీణ జనాభాలో సాధికారతకు టెలికాం సాంకేతిక వినియోగం అంశంపై యువతకు వ్యాస రచన వకృత్వ పోటీలు నిర్వహించారు. అధిక సంఖ్యలో యువత పోటీలో పాల్గొనగా వ్యాస రచనలో ప్రవీణ్, ఆంజనేయులు, ప్రవల్లిక ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వక్తృత్వంలో ప్రతీక్, మహేష్, తిరుపతిలు ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి నగదు బహుమతితోపాటు పోటీల్లో పాల్గొన్న వారికి ప్రశంస పత్రాలు బహుకరించారు. ఈ సందర్భంగా రాకేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ మూడు సంవత్సరాల్లో 6జీ దేశమంతా అందుబాటులోకి వస్తుందని, దీనిపై అధ్యయనం వేగవంతం జరుగుతోందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని యువత విస్తతంగా ఉపయోగించుకుంటోందని, సామాజిక మాధ్యమాలు ప్రాధాన్యత పెరిగిందని రాకేష్ కుమార్ సింగ్ చెప్పారు. అయితే, వీటి పట్ల జాగ్రతగా ఉండాలని, తమ సమాచారం పంచుకునే విషయంలో గోప్యత పాటించాలని సూచించారు. వేదికపై జాయింట్ కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ చొంగ్రాలియన్ మెచక్ సంపర్ డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్స్ (గణాంక శాఖ) డి. సురేఖతో పాటు టెలికమ్యూనికేషన్స్ అధికారులు పలువురు పాల్గొన్నారు.